# సివంగి



**చుట్టూ చీకటి. చెంపగొట్టి దాక్కుండే చీకటి. నూనే నిండిందో గాలే నింపిందో గుడ్డిదీపం మలిగి పోయింది. తడుకల సందుల్లోంచి గుడిసె లోకి సల్లగ ఈదరత్తుంది. చింపుల బొంతలో ముడుచుకుని పండుకున్న పోశి పాణం తల్లడ మల్లడ మైతుంది. జెర్రాగితే తెల్లారుతదని! తెల్లారితే పటేలు ఊర్లెకత్తడని!**

అందుకే రాత్రినుండి కంటిమీద కునుకు లేదు. ఒక పక్క ఆకలిమంట. మరోపక్క కడుపు మంట. పేగులు గుర్రుమంటున్నాయి. కడుపు కుట్టువట్టినట్టు నొత్తుంది. ఎప్పుడో పొద్దున తిన్న నాలుగు మెతుకులు. కడుపుల ఏ మూలకు సొలలేదు. ఊరు నిద్రపోకముందే ఆకలి నిద్ర లేచింది.

మెల్లెగ లేచి కూసుంది పోశి. మెసులు తున్న బిడ్డను జోకొట్టింది. సొలుక్కుంటూ మంచి నీళ్ల కుండదగ్గరికి పోయింది. నీళ్లు శితాలమోలె చల్లగున్నయి. గిలాసతోని ముంచుకుంటూ గటగట తాగింది. అగ్గిమీద నీళ్లు చల్లినట్టు వేడి ఆవిర్లు బేకోటు రూపంలో బయటకొచ్చినయి. కడుపు సల్లవడ్డదిగని కడుపు మంట సల్లారలేదు.

వెనక్కి తిరిగి పతుకులాడినట్టూ చీకట్లో నడుస్తూ పోశయ్య మీద అడుగేసింది. పట్టు తప్పిసొలిగి కిందపడ్డది. పోశయ్యకు కూడా నిద్రపట్టనట్టుంది. అడుగు బలంగా పడేసరికి గిలగిల లాడిండు.

"అవ్వా.... సువ్వర్దానా..... ఏంబుట్టిందే! దొక్కల తొక్కితివి. ఒక్కసారి పాణమెల్లిపాయె. ఇంక నీపున్నెం. బొండిగ మీద అడుగెయ్యలేదు" కోపంగా అన్నడు పోశయ్య.

కండ్లు చిట్లిచ్చి చూసింది పోశి. చీకట్ల ఏదీ కనిపించలేదు. అరచేతుల్ని భూమి మీద ఆనవెట్టి గొగ్గాల్లమీద లేచి కూసుంది. అప్పటికి పోశయ్య తిడుతనే ఉన్నడు. పోశికి కోపమచ్చింది.

"బొండిగ మీద నేను తొక్కుడుకాదు. పటేలు వత్తడు. ఏమో ఇత్తడని ఎదురుస్తూత్తున్నవు సూడు. వాడు తొక్కుతడు గట్టిగ. నేను చూడకుంట తొక్కినగని, వాడు సూసుకుంటనే తొక్కుతడు. నీలగ్గం గట్టిగ జేత్తడు" విసురుగా అన్నది.

ఆ మాటలతో పటేలు యాదికచ్చిండు పోశయ్యకు. కడుపుల ఏదో దడదడ మొదలయ్యింది. జెట్టన లేచి కూసున్నడు. గొంగడి బొంతను సదురుకుంటూ 'అవునే.... పటేలు వత్తడంటవా...? వత్తే మన కట్టాలన్నీ తీరినట్టే. ఖాయంగనే వత్తనని చెప్పిండటగనీ...' గొనుగుతున్నట్టుగా అన్నడు.

చీకట్లో కనిపించలేదు గనీ కరుత్తునా పొడుత్తునా అన్నట్టు చూసింది పోశి. కోపంగాఏదో అందామనుకునేసరికి బిడ్డ నిద్రలో ఏడ్చింది. 'నువ్వు నల్లమొఖపోనివి' అంటూ అంబాడినట్టు నడిచి బిడ్డకు బొంతకప్పి జోకొట్టింది.

పోశయ్యకు బుద్ధి తెలిసిన్నాటికే రాంరావు పటేలుబర్లకాడ జీతమున్నడు. వాడు పుట్టుడే పటేలు బర్లకొట్టంల పుట్టిండు. అయ్యవ్వ చిన్ననాడే కన్ను మూసిండ్రు. అప్పటి నుండి బర్లకొట్టమే ఇల్లయింది. బర్లే సోపతిగాల్లయినవి. అడివే లోకమయింది. మనిషి కురుసగ, నల్లగ ఉంటడు. పేడుమూతి. ఎడ్డెక్కిరితనం. భయం, భక్తి, మరీ ఎక్కువ పటేలంటే. పిల్లను ఇచ్చుడుకు ఎవరూ ముందుకు రాలేదు. అందుకే ఈడు దాటినా పెండ్లి కాలేదు.

పోశి రాంరావు పటేలు శాతమాదిగి ఎల్లుగాని బిడ్డ. ఎర్రతేలు లెక్క ఉంటది. ఎత్తుకు దగ్గచిత్తు. ఒక్కతే బిడ్డ. చిన్నప్పుడే లగ్గమైంది. ఒకసారి బతుకమ్మ పండుక్కు అవ్వగారింటికచ్చింది.

పటేలు చిన్నకొడుకు పట్నంల చదువుకుంటడు. ఇంటికి వచ్చినప్పుడు ఈడుమీదున్న పోశిని చూసిండు. ఇంట్లో ఎవ్వలు లేని యాల్ల పటేలవ్వ రమ్మన్నదని పిలిపించుకుని ఖరాబు జేసిండు.

భయానికి పోశి నోరు విప్పకపోయినా ఊరు కోడైకూసింది. తప్పు ఎవరిదైనా నెలతప్పింది పోశి. ఆరునెలల కిందనే దాని మొగుడు బొంబాయి బతుకపోయిండు. నెత్తినోరు లబలబ మొత్తుకున్నడు ఎల్లుగాడు. గుండెదడీలుమన్నది. పోశిని పటేలు కాళ్లమీద పడేసి బోరుమని ఏడ్చిండు.

పటేలుకు బ్రహ్మదేవుడు - గొర్రెపిల్ల కథ యాదికచ్చింది. 'నన్ను అందరూ కోసుకతింటుండ్రు. ఎట్లైనా అది బందుచెయ్యుమని' దేవున్ని అడిగిందట గొర్రెపిల్ల. 'వాల్ల సంగతేమోకాని నిన్ను చూస్తుంటే నాకే తినబుద్ధయితుంది' అన్నడట దేవుడు. అప్పుడు తలవంచిన గొర్రె ఇప్పటికీ తల ఎత్తుతలేదట. ఈ కథ చెప్పి గుబురు మీసాలు మెలేసుకుంట వంకరగా చూసిండు పోశిని.

పోశి గుండె కలుక్కుమంది. నరాల్లోకి రక్తం ఎగదన్నింది. పటేలును పండవెట్టి తొక్కాలన్నంత మంటపుట్టింది. తాపతాపకు కాళ్లు మొక్కబోతున్న తండ్రి చేతిని పట్టి ఆపి అణుచుకున్న కోపంతో ఉరిమినట్టు చూసింది.

పటేలు పండ్లు పటపట కొరికిండు. పోశివైపు కొరకొర చూస్తూ.... "వారీ ఎల్లుగా! అయిందేదో అయింది. ఆడిది మంచిదైనంక మొగోడు ఎట్ల చెయ్యేత్తడురా! దీనికి బాగ కావురమచ్చి నా కొడుకును సూసుకుంది. నా ఉప్పు తిని నా ఇంటికే ఎసరు పెడుతననుకుంది. కాలుకు బురద అంటిందని కాలును నరుక్కుంటమా! తెలిసి తెల్వక తప్పుచేసింది. దవాఖాన ఖర్చులిత్త. కడుపును కడిగిచ్చుకరా.

ఎవ్వలకు తెలువకుంట అత్తగారింటికి పంపు. ఎర్ర చెలుక ఎకురం గుడ్డం రాసిత్త. దున్నుక బతుకు" అన్నాడు.

గుండెల ఎన్ని బాంబులేగినయో.... ఎంత తల్లడమల్లడమైందో పోశికి. కాండ్రకిచ్చి తుపుక్కున పటేలుముందు ఊంచింది.

రాజులు దండెత్తి రాజ్యాన్ని గుంజుకున్నట్టు.... తన పెత్తనం మొత్తం కిందపడ్డట్టు పటేల్ రాంరావు గరానికచ్చిండు. 'అదునా మాదిగిముండ నన్ను చూసి ఊంచుతాది! ఇప్పుడేమన్నా బదునామైత. దీని బతుకు కుక్కబతుకు చెయ్యకపోతే నేను పటేల్ రాంరావునే కాదు' మనసులో అనుకుని పైకి మాత్రం నవ్విండు.

తంగేడు చెట్లు, మోదుగులు, నర్రెంగలు దాటినంక ఇరువై ఎకరాల పెసరగుడ్డం, తలాపుకు గుట్ట, గుట్టవతల ఒర్రె. పెసరగుడ్డం దాటినంక బోరుగడ్డమీద పలుగురాళ్లతో నిండిన ఎర్రచెలుక. అందులో తంగేడు గునుగు తప్ప పునాసవిత్తనమే పండది. అటువంటి ఎర్ర చెలుకను పట్టాకాయిదం ఇచ్చిండు పటేలు.

వద్దనే ధైర్యం కూడాలేదు ఎల్లుగానికి. చెడిపోయిన బిడ్డను ఒకచేత, చెల్లని భూమి కాగితాన్ని ఒక చేత పట్టుకుని వలవల ఏడ్చుకుంట పటేలు పాటాకు దాటిండు. ఎనుకకు తిరిగి 'నీ గడికి ఏసులేకపోని' అంటూ మూడు దోసిళ్ళ మన్నెత్తి పోసి ఇంటితొవ్వ బట్టిండు.

పోశి దవాఖాండ్లకు పోయిన్నాడే మొగుడు బొంబాయి నుండి దిగిండు. పటేలు ఎర్ర చెలుక రాసిచ్చినంక ఊరంతా ఇంకోరకంగా ముచ్చట్లు పెట్టింద్రు. పంచాదిపెట్టిచ్చి పోశిని ఇడిసిపెట్టిండు దాని మొగుడు. ఆనాడు మంచం పట్టిన ఎల్లుగాడు మల్లలెవ్వలేదు. వాని శవమే లేచింది.

రందితో యావటిల్లిన తల్లిగూడా కన్నుమూసింది. తన మొగనికి పటేలే కారటేసిండని తెలిసినా నోరు తెరువలేదు పోశి. ఇద్దరు సచ్చిపోవడంతో దిక్కులేనిదైంది. ఏ దిక్కూలేని పోశికి పోశయ్యనే పెద్ద దిక్కయిండు.

పటేలు చెప్పడంతో వాళ్లు వీళ్లు గలిసి పోశికి చీర్రైక కట్టిచ్చింద్రు. పోశి గుడిసె పోశయ్యదైనది. పోశయ్య పటేలు మనిషయిండు. పటేలు పోశిమీద కన్నేసి పగబట్టిండు. యాడికిపోతది ముండ. చెప్పు కింద తేలు అయిందనుకున్నడు. కానీ అప్పటికే పాపం నిండి అలుగెల్లింది. అన్నల భయంతో పటేలు పట్నం జేరిండు. పోశిపాణం సల్లవడ్డది. పోశయ్య మాత్రం పటేలుకు ఎంతగతిపట్టెనని ఏడ్చిండు.

ఐదేండ్లు గడిచినయి. పటేలు పట్నంల ఉండే రాజకీయం జేత్తుండు. రెండు మూడుసార్లు ఊర్లెకు వచ్చినా గంటల మీదనే బయటపడ్డాడు. తనకు అనుకూలంగ ఉన్న వ్యక్తినే సర్పంచ్‌గా గెలిపిచ్చుకున్నడు. పటేలు భూములు దున్నవద్దని ఒకటి రెండుసార్లు అన్నలు బెదిరిచ్చినా, దున్నుకునేది పేదోల్లే కాబట్టి కౌలు ఇయ్యకుండ్రి అన్నరు. అప్పటి మందం తలూపినా, మాలమాదిగల కష్టం నోట్లకట్టల రూపంలో పటేలుకు చేరుతనే ఉన్నది.

జీతం బందయినంక కైకిలు గూడా సక్కగ దొరుకలేదు పోశయ్యకు. ఏం చేత్తే బాగుంటదని బాగా ఆలోచించిండు. ఎర్రచెల్క కాయితం యాదికచ్చింది. ఒర్రెనీళ్లను మలిపి సాగుజెయ్యాలను కున్నడు. పోశి ఒప్పుకోలేదు. నేను కైకిలిజేసి సాదుతనన్నది. ఎంతజెప్పినా వినకుండా పట్నం

బోయిపటేలును కలిసిండు పోశయ్య. ఆ భూమి నీదే! నీబుద్దున్నట్టు జేసుకోరా అని వెన్నుతట్టిండు పటేలు.

కొండంతబలంతో ఇంటికచ్చిండు పోశయ్య. అందినకాడల్లా అప్పుజేసిండు. ఎర్రచెల్కలనే గోరిగట్టుకున్నడు. బోరుగడ్డ తవ్వి రెండు నిలువుల నయిగొట్టిండు. పెసరగుడ్డం లోనుండి కాలువ తీసి ఒర్రె నీళ్లను మలిపి సాగుజేసిండు.

చెలుక నీళ్లతో తడిసిన్నాటికి వాళ్ల శరీరంల రక్తం ఎండుకపోయింది. పెయ్యి మీద బొక్కలేసుకున్నట్టు బొక్కల మీద తోలుకప్పుకున్నట్టు ఇద్దరు బరిగెల లెక్కయింద్రు. అయినా వాళ్లమొహం మీద నవ్వు. మాకూ ఎకురం భూమి ఉన్నదన్న ధీమా! చెలుక విషయం తెలిసినంక అంతకంటే ఎక్కువ నవ్వు పటేలు మొహం మీద మెరిసింది.

ఎర్ర చెలుక నాటుపడనే లేదు. ఇరవై ఎకురాల పెసరగుడ్డం తీరే మారింది. ఒర్రెనీళ్లతో రెండు పంటలు తీసేటట్టయింది. రెండునెలలు తిరక్కుండానే యాభై వెయిలకు ఎకురం ధర పలికింది.

పెసరగుడ్డాన్ని మాలమాదిగోల్లకే అమ్ముతనని ఎలాన్‌జేసిండు పటేలు. ఊరు చుట్టూ ఎకురం అద్దెకురం పొలం ఉన్నోల్లు దానిని ఎక్కువ ధరకు అమ్ముకుని తక్కువధరలో వచ్చే గుడ్డాన్ని కొనుక్కున్నరు. ఒకరిద్దరు కొనంగనే ఆ భూమి కొనవద్దని నక్సలైట్లు బెదిరిచ్చింద్రు. ఇది ముందుగనే ఊహించిన పటేలు దళిత సంఘాలను ఉసిగొలిపిండు.

కొనెటోడు భూమిలేనోడే కదా! కష్టం చేసుకబతుకుతమని కొంటంద్రు. గాల్లను బెదిరిచ్చుడు ఎందుకని దళితసంఘాలు గాయికెత్తుకున్నయి. నక్సలైట్లకు నాలుక సందుల ముల్లిరిగినట్టయింది. గమ్మున ఊరుకున్నరు. పటేలు గుడ్డం మొత్తం అమ్ముడుపోయింది.

పోశయ్య పొలం కల్లం లేచింది. పంటను అమ్మి అప్పుగట్టిండు. 'సూత్తివా! వద్దు వద్దంటివి. ఇంట్లగూసుంటే ఇంతపంట యాడ కనవడుతుండె' అన్నడు పోశయ్య.

ఇప్పుడే మురువకు. ఇల్లు అలుకంగనే పండుగైతదా! అన్నది పోశి. ఆమె అన్నట్టే అయింది. పోశయ్య పొలంలో ఎవలో నాగలి కట్టింద్రు. ఇదేంటిదని అడిగితే పటేలు అమ్మిండని కాయిదాలు సూపిచ్చిండు.

పోశయ్య గుండె పగిలింది. ఇంటికి వచ్చి సోకం పెట్టుకుని ఏడ్చిండు. పొయ్యిమీద కుండలేదు. గుడ్డుకు కుంచెడు కన్నీళ్లు వడిసినయి. చేసినకట్టం యాదికచ్చింది. 'నేను చెట్టుగొట్టి గుట్ట తవ్వితేనే గదా ఆ భూమికి విలువచ్చింది. ఇంతమాత్రం మొఖం సూడడా పటేలు' అనుకుని భార్యతో బస్సెక్కిండు పోశయ్య.

దోతీలాల్చిదీసి సూటు బూటేసిండు పటేలు. కౄరత్వం ఇంతకుముందు మీసాలసాటుకు పెదవుల మీద విషపునవ్వు రూపంల ఉండే. ఇప్పుడు చూపుల్లో కెక్కి నల్లకళ్లద్దాల సాటుకు దాక్కుంది. మనిషి దొడ్డుగయిండు. మీసాలు నున్నగ గీకి నెత్తెంటికలకు రంగేసిండు.

పటేలును చూడంగనే పోశయ్య పక్కున పగిలి ఎక్కెక్కిపడి ఏడ్చిండు. పోశి తనలో తాను కుమిలిపోతూనే పటేలును అంచనా వేత్తుంది. ఏడ్పులు ఆర్పులైనంక నోరు విప్పిండు పటేలు.

"పోశిగా... అక్కడ.... ఆ జంగల్‌ల ఏం ఎవుసం జేత్తవురా! ఇద్దరు ఇక్కడికే రాండ్రి. పటేలవ్వకు

చాతనైతలేదు. పోశి ఇంట్ల పనిజేత్తది. నువ్వు కూరగాయలు, తోటపని జేత్తువు. తిండిపెట్టి నెలకు వెయ్యిరూపాయలిత్త. నువ్వు ఆరుగాలం కట్టపడినా ఇంత సంపాయించవు. నీ బిడ్డను ఇక్కడ బడికి తోలియ్యచ్చు" పోశివైపు ఓరగా చూస్తూ అన్నడు.

అడుగకముందే వరమిచ్చినట్టు సంబూర పడ్డడు పోశయ్య. 'ఒప్పుకుందామా' అన్నట్టు పోశివైపు చూసిండు. పోశికి అరికాలిమంట నెత్తి కెక్కింది. 'చీము నెత్తురు చేసుకుని పొలం దున్నుకుంటే గద్దలెక్క తన్నుకపోయిండు. ఇప్పుడు ఎంగిలి మెతుకులు ఏత్తనురారా అంటే ఈ మూతినాకుల్లోడు లొట్టలు గొట్టుకుంట మిట్టమిట్ట జూత్తుండు' అనుకుంది కోపంగా. తనకు ఇష్టం లేదన్నట్టు మొహం పెట్టి నాలెగీతలు గీసింది.

పటేలు అంచనా కిందిమీదయింది. అహం దెబ్బతిన్నది. కోపాన్ని మంచి మాటల్లోకి మలిపి అక్కడ ఎట్ల సుఖముంటదో.... తనతో కారులో ఎక్కడెక్కడ తిరుగుతడో వర్ణించి చెప్పి పోశయ్యలో ఆశను నింపిండు.

అప్పుడే ఆ ఇల్లు తనదైన భావన మొదలయింది పోశయ్యకు. నరాల్లో నిద్ర పోతున్న బానిసతనం మేలుకుంది. చిన్న చిన్న పనులు చేయడం మొదలెట్టాడు. పటేలుకు చాయ తెచ్చిండు. తాగిన గిలాసలు కడిగిండు. పోశి మాత్రం ఒక మూలకు భయం భయంగా కూసుంది. చేను ఇత్తడన్న ఆశ అడుగంటిపోయింది.

సాటుసాటుకు పోశిని బుదరకిచ్చుడు మొదలెట్టిండు పోశయ్య. ఆమెకు చిర్రెత్తుకచ్చింది. "ఆడిగుట్లోడా... మనమీద దయపుట్టి రమ్మంటలేదు. అంత దయ ఉంటే ఆ భూమినే మనకు ఇత్తుండే. పటేలవ్వకు చాతనైతలేదట. అట్లంటే ఏంటిదో నీకు ఎరుకేనా?... చేనును అడుగుతనని వచ్చి ఇక్కడనే ఉంట నంటవా.....థూ" అంటూ బయటకు నడిచింది.

ఊరికి వచ్చినంక 'నోటిముందటి బుక్క ఎత్తగొడితివి' అని తిట్టిండు పోశయ్య. రెండు మూడు సార్లు కొట్టిండు. పటేలు ఊర్లెకు వచ్చినప్పుడల్లా పోశయ్యను పిలిపిచ్చుకుని 'పట్నం వత్తార్రా' అని అడుగుతనే ఉన్నడు. పోశయ్య భార్యను ఒప్పించడానికి కొడుతనే ఉన్నడు.

మల్లీ రేపు పటేలు వత్తుండని తెలిసింది. అందుకే పోశికి నిద్రరావడం లేదు. వీడు ఎన్ని రోజులు నా బతుకుతో ఆడుకుంటడు అనుకుంది.

ఆమె భయంతో పనిలేకుండా కాలం కరిగిపోయంది. చీకటిరేకల్ని చీల్చుకుంటూ వెలుగు వచ్చింది. కోడిగొంతులో పొద్దు పురుడు పోసుకుంది. ఊర్లెకు పొద్దు రాకముందే పటేలు కారు వచ్చింది.

ఊరిమీది పొలాలను అమ్ముతున్నడని తెలిసి కారుకంటే ముందుగనే వచ్చింద్రు జనం. అందరి కంటే ఎనుక నిలవడ్డ పోశయ్యను పిలిచి భుజం మీద చెయ్యివేసి 'బాగున్నావురా పోశయ్యా!' అన్నాడు పటేలు.

ఆ పిలుపు ఏదో కొత్తగా వినిపించింది. అంతమందిల పటేలు తననే పేరు పెట్టి పిలిచి మాట్లాడుతున్నడంటే పోశయ్య చాతి ఉబ్బింది. మురుసుకుంట తలూపిండు.

"వీడు లచ్చిమిరాంగ తడుక అడ్డం పెట్టుకున్నడు. తిండిపెట్టి నెలకు వెయ్యి జీతమిత్తరా అంటే వత్తలేదు. ఇప్పుడు ఏదన్న పని చూపించమంటుండు". అక్కడున్న వారందరితో అన్నడు

పటేలు. వారు పోశయ్యను మనిషికొ[illegible]టన్నరు. ఎట్లనన్న ఇంకేదైనా పని సూపియ్యిమని తాను ఒక్కడినే వస్తానని బతిలాడిండు ప[illegible]యను.

"నిన్ను సూత్తుంటే గోసనిపిత్తుందిరా. అక్కడికి రాకపోతే రాకపోతిరిగనీ ఇట్లనన్న జెయ్యుండ్రి. ఈ ఇంట్ల ఉండుండ్రి. ఇల్లు అడివి లెక్కయింది. మీరున్నరంటే ఊడ్చి సల్లుతరు. వారంకొకనాడు వచ్చిపోత. వచ్చిన్నాడు తానానికి నీళ్లుపెట్టి బట్టలు పిండితే చాలు. నెలకు వెయ్యి రూపాయలిత్త" పోశయ్యతో అన్నాడు పటేలు.

అందరూ 'అబ్బ పటేలు ఎంత మంచోడు. ఇల్లుకు ఇల్లే ఇత్తనంటండు' అనుకున్నరు. పోశయ్యనైతే సంబూరంతో తికమకైండు. పటేలు ఇంటిలో తానుండుడన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతుండు. ఊర్లెనే ఉండుడు కాబట్టి పోశి తప్పకుండా ఒప్పుకుంటుందనుకున్నడు. వెంటనే ఇంటికి వచ్చి విషయమంతా భార్యతో చెప్పిండు.

"మల్లా ఒక కొత్త ఏశం ఏసినవా... అసలు సంగతి నీకు తెల్వది. పటేలవ్వకు పక్షవాతమచ్చి కాలుచెయ్యి పడిపోయిందట. అక్కడ కోడండ్లు రోతను ఎత్తిపొయ్యనంటుండ్రట. ఆమెను తెచ్చి ఇక్కడ ఉంచిపోతడు. వీడు వారంకొకసారి వచ్చి చూసిపోతడు. వాళ్లకు సాకిరి చెయ్యాలె" విసుగ్గా అన్నది పోశి.

"ఏదో ఒకటి తియ్యే! మనకు జీతమిత్తుండ్రుగదా!" సర్దిచెబుతున్నట్టుగా అన్నాడు పోశయ్య. జీతమిత్తున్నది అందుకు కాదు. మనుసులు లేక ఇల్లు అడివి అయింది. తోటమూలకు పడ్డది. అట్లుంటే ఎవ్వలు కొనరు. మనం వాటిని సాపుజేసినంక అమ్ముకుంటడు. మనం మల్ల ఈ గుడిసెలకు వచ్చుడే. ఎట్లైనా బతుకపోదాం" చెప్పింది పోశి.

పోశయ్య వినలేదు. పోవుడు పోవుడేనని పట్టు పట్టిండు. పోశి వినకపోతె కట్టెతో కొట్టిండు. అదే ముచ్చట పటేలుతో చెప్పుదువుదా. నేను మాటిచ్చిన" అని బంగ్లకు తోలుకచ్చిండు. పటేలు ఎట్లనన్న సర్దిచెబుతాడనుకున్నడు.

ఇంట్ల ఎవ్వలు లేరు. పటేలు ఒక్కడే ఉన్నడు. పోశిని చూసి నవ్విండు. నీకు కడుపు నిండ తిండి ఉంటే సినిమా యాక్టర్ లెక్క ఉందువే అన్నడు. పోశి మండిపడ్డది. పోశయ్య సిగ్గుపడ్డడు. సిగరేట్లు తెమ్మని పోశయ్యను బయటకు పంపి పోశిని ఒప్పించాలని చూసిండు పటేలు.

పోశి మౌనంగా ఉండిపోయింది. అదే అంగీకారమనుకున్నాడు. రాత్రికి ఎప్పుడు రావాలో చెప్పిండు. రాకపోతే బతుకు ఎట్లా ఉంటదో చెప్పిండు. పటేలవ్వను ఎట్లా జూసుకోవాలో చెప్పిండు. తను చెప్పినట్టు వింటేనే బతుకుదెరువు ఉంటుందని బెదిరిచ్చిండు. మౌనంగా ఏడుస్తూ ఇంటికి వచ్చింది పోశి.

పొద్దుగూకింది. పటేలు చెప్పిన టైం అయింది. అప్పటికే పటేలు పోసిన మందు తాగి సోయిలేకుండా పడి ఉన్నాడు పోశయ్య. పావుగంటలో బంగ్లా చేరుకుంది. ఊరంతా నిద్రపోతుంది. పటేలు ఒక్కడే మెలుకువతో ఉన్నాడు. పోశిని చూడగానే నవ్వాడు. బాగా తాగినట్టున్నాడు. పోశి గదిలోకి అడుగు పెట్టగానే సొలుక్కుంటూ వెళ్లి తలుపు మూసాడు.

పోశి కళ్లెర్ర జేసింది. ఎక్కడలేని తెగింపు వచ్చింది. చేతికందిన కట్టెను పట్టుకుని సివంగిలా పటేలు మీదికి ఉరికింది. 'అరెయ్.... కూటికి గతి లేకపోవచ్చు... కులం తక్కువ కావచ్చు. గుణంలో

నీ కంటె వెయ్యిరెట్లు ఎక్కువ. నన్ను గోస పుచ్చుకోవడితివి గదరా... నాబతుకు నాశినం జేత్తివి... నీయవ్వా.....' అంటూ మెడశింపుల మీద రెండు దెబ్బలేసింది.

ఉద్యమాలకు సమాంతరంగా ఎదిగినోడు.... గాలివాటం తెలిసినోడు.... ఏం ఉద్యమం నన్నేం చేసింది. ఎవ్వలు నన్నేంచేసింౘు. నేను ఇప్పటికీ, ఎప్పటికీ పటేలునే అనే ధీమాతో ఉన్నవాడు.... రాంరావు

నిలువునా ఇరుసుకపడ్డడు. పుర్రెమీద అదే ఆవేశంతో మరో రెండు దెబ్బలేసింది. పక్కున పగిలి శిదలు శిదలయింది.

ఏమీ జరుగనట్టే పోశి ఇంటి మొఖం పట్టింది. మరునాడు ఊరిలో పెద్ద పుకారు. అన్నలు పటేలును కొట్టి చంపింౘని! ●